
## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మే 11 : నారాయణఖేడ్ మండలం ర్యాకల్‌కు చెందిన మహ్మద్ సలా ముద్దీన్‌కు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరమన్నారు.

**నిజాంపేట్‌లో..**

నిజాంపేట్, మే 11: . నిజాంపేట్‌కు చెందిన సాయమ్మకు ఆదివారం మంజూరైన రూ. 18వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్వరాచారి, రాంచందర్ రావు పాటిల్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, లింగాగౌడ్, గడ్డమీది సాయగౌడ్, కృష్ణ, అంబదాస్ గౌడ్, హనుమగౌడ్, తదితరులు ఉన్నారు.

## పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నిజాంపేట్, మే 11 : నిజాంపేట్ మండలం నాగదార్ గ్రామ పంచాయతీ పరిధి లోని ఎర్రకుంట తండాకు చెందిన గమినీ బాయి ఇటీవల చికిత్స పొందింది. ఆదివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీలు లక్ష్మీబాయి రవీందర్ నాయక్, నర్సింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు నగేశ్ సెట్, కుర్మ సంఘం తాలూకా అధ్యక్షుడు మల్లొండ, దస్తగిరి పలువురు ఉన్నారు.

**కల్హేర్‌లో..**

కల్హేర్, మే 11: మండల పరిధిలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన కిష్టయ్య, దూదెకుల ఖయ్యూమ్ ఇటీవల మృతి చెందారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు అలీ, మండలాధ్యక్షుడు రాంసింగ్, నాయకులు దాడే పండరి, బేతయ్య, శ్రీనివాస్‌గౌడ్, రాములు, మల్లేశం తదితరులు ఉన్నారు.

## కల్హేర్‌లో జొన్నల కేంద్రం ప్రారంభం


జొన్నల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీసీ నర్సింహులు

కల్హేర్, మే 11 : మండల కేంద్రమైన కల్హేర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో జొన్నల కేంద్రాన్ని ప్రారంభించారు. యాసంగి రైతులు పండించిన జొన్నలను దళారులకు విక్రయించకుండా కేంద్రానికి తీసుకురావాలని సీసీ నర్సింహులు రైతులను కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే రైతులకు మద్దతు ధర అందుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీవోఏ బాలమణి, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పా ల్గొన్నారు.

## అమర జవాన్లకు నివాళి


అమరులైన ఆర్మీ జవాన్లకు నివాళులర్పిస్తున్న పలుగు తండావాసులు

నారాయణఖేడ్, మే 11: కొన్ని రోజులుగా భారత్- పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు ఆదివారం నారాయణఖేడ్ మండలం పలుగు తండావాసులు నివాళులర్పించారు. భారత సైనికులకు యావత్తు దేశం అండగా ఉందనే సందేశమిస్తూ అవసరమైతే సరిహద్దులోకి వెళ్లి పోరాటం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రతిజ్ఞ చేశారు. ఒక రోజు వేతనాన్ని ఆర్మీ కోసం విరాళంగా ఇస్తామని ప్రకటించారు. బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌నాయక్, ఆర్మీ హవాల్దార్ పండరి, తండావాసులు పాల్గొన్నారు.

## సైనికుల క్షేమం కోరుతూ పూజలు


దత్తాచలక్షేత్రంలో పూజలుచేస్తున్న మాధుర గ్రామ యువకులు

హత్నూర, మే 11 : భారత దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న భారతసైనికులు క్షేమంగా ఉండాలని, యుద్ధంలో విజయం సాధించాలని కోరుతూ హత్నూర మండలం మాధుర శివారులోని దత్తాచలక్షేత్రంలో గ్రామ యువకులు ప్రత్యేకపూజలు చేశారు. యుద్ధంలో అమరులైన వీరసైనికుల ఆత్మకు శాంతి చేకూరాలని పూజలు చేశారు.

## ఉమ్మడి జిల్లాలో క్రికెట్ జట్ల ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్, మే 11: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రారంభమయ్యే అండర్-25 ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ మ్యాచ్‌ల్లో పాల్గొనే జట్ల ఎంపికలు చేపడుతున్నట్లు ఉ మ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాల వారీగా జరిగే జట్టు ఎంపికల్లో భాగంగా మొదట సంగారెడ్డి జిల్లా రెండు క్రికెట్ జట్ల ఎంపికను ఈ నెల 13న ఉదయం 10 గంటలకు సంగారెడ్డి జూబ్లీక్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మెదక్ జిల్లాకు సంబంధించి రెండు క్రికెట్ జట్ల ఎంపికను ఈ నెల 14న ఉదయం 10 గంటలకు మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఉంటుందన్నారు. సిద్దిపేట జిల్లాకు సంబంధించి రెండు క్రికెట్ జట్ల ఎంపికను ఈ నెల 16న ఉదయం 10 గంటలకు సిద్దిపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో ఎంపికలు ఉంటాయన్నారు. ఈ లీగ్ పోటీలు 2డే ఫార్మాట్‌లో మ్యాచ్‌లు జిల్లాల్లో జరుగనున్నాయని వివరించారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 17 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు త మ ఒరిజినల్ ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలతో సకాలంలో హాజరుకావాలన్నారు. సంగారెడ్డి జట్ల ఎంపికలో సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్, నియోజకవర్గ క్రీడాకారులు, మెదక్ జట్ల ఎంపికలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గ క్రీడాకారులు, సిద్దిపేట జిల్లా జట్ల ఎంపికలో సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గ క్రీడాకారులు పాల్గొనాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# దాహం తీర్చని సమీక్షలు

- చిట్కుల్‌లో ఆరు నెలలుగా తాగునీటి ఎద్దడి
- నవంబర్ నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత
- సాయి సంతోషి కాలనీ వాసుల నిరసన
- భూగర్భ జలాలు కలుషితం
- ట్యాంకర్లతో నీటి పంపిణీ మరిచిన బల్దియా


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న సాయి సంతోషి కాలనీవాసులు

పటాన్‌చెరు రూరల్, మే 11 : ఒక వైపు జిల్లా అధికారులు సమీక్షా సమావేశాలు పెట్టి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు. మరో పక్క మంత్రులు, ఎమ్మెల్యేలు నీటి ఎద్దడి లేకుండా యాక్షన్‌ప్లాన్ అమలు చేయాలని అధికారులకు ఆదేశాలిస్తున్నారు. మండే వేసవిలో నీటి ఎద్దడి అనే మాట రాకుండా ప్రత్యామ్నాయంగా నీటి ట్యాంకర్లు పెట్టి నీటిని సరఫరా చేయాలని సూచిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఆదేశాలేవి క్షేత్రస్థాయిలో అమలు లేదు. ప్రజల దాహం తీరట్లేదు. ప్రత్యేక అధికారుల పాలనంతా ఆన్‌లైన్ రిపోర్టుల్లోనే కొనసాగుతున్నది. పారిశ్రామిక కాలుష్యంతో భూగర్భజలాలు పనికి రాకుండా పోయిన గ్రామాల్లోనూ ఆరు నెలలుగా ప్రజలకు తాగునీరు అందట్లేదు. ముందస్తు ప్రణాళిక లేకుండా, నిధులు కేటాయించకుండా ఇస్తున్న ఆదేశాలకు కార్యరూపం కరువవుతున్నది. వివరాల్లోకి వెళితే ..

పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో సాయి సంతోషి కాలనీకి ఆరు నెలలుగా తాగునీరు సరఫరా కావడం లేదు. ఆరు నెలల క్రితం వరకు మిషన్ భగీరథ నుంచి ఈ కాలనీకి తాగునీరు వచ్చేవి. ఆరు నెలల కింద రోడ్డు విస్తరణ కాంట్రాక్టర్ పైప్‌లైన్ పగులగొట్టాడని కాలనీ వాసులకు సమాచారం ఇచ్చి నీటిని బంద్ చేశారు. ఆ తర్వాత ఈ కాలనీకి తాగునీరు ఇవ్వాలనే ఆలోచనే అధికారులు చేయడం లేదు.

**కాలనీవాసులు నిరసన**

సాయి సంతోషి కాలనీవాసులు ఆరు నెలలుగా తాగునీరు రావడం లేదని 'నమస్తే తెలంగాణ' ముందు వాపోయారు. ఖాళీ బిందెలతో తమ నిరసనను వారు వ్యక్తం చేశారు. మహిళలు ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఇండ్లలోని బోర్లలో 1800 నుంచి 2000 హై టీడీఎస్ నీళ్లు వస్తున్నాయని, అవి వాడేందుకు పనికిరావని పేర్కొన్నారు. భూగర్భ జలాలు పారిశ్రామిక కాలుష్యంతో పాడైనందున ఈ నీటిలో దుర్వాసన కూడా వస్తున్నదన్నారు. గతంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా వచ్చేవని అవే నీటితో వంటలు వండేవారమని, నీటిని తాగేవారమని వారు తెలిపారు. ఇప్పుడు తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ఘాటైన వాసనతో వస్తున్న బోరునీటినే వంటలకు, స్నానాలకు, ఇంటి పనులకు ఉపయోగిస్తున్నామని తెలిపారు. నాయకులకు, అధికారులకు చెబితే త్వరలో వస్తాయని చెబుతూ మాటలకు పరిమితం చేస్తున్నారని మండిపడ్డారు. తమ కాలనీకి మంజీర నీరు సరఫరా చేయాలని ఇస్నాపూర్ బల్దియాలో కోరినను పట్టించుకోవడం లేదని కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమ కాలనీలో ఏర్పడిన నీటి ఎద్దడిని పరిష్కరించాలని వారు కోరారు. చిట్కుల్ గ్రామాన్ని ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేసిన తర్వాత నీటి సమస్యను పరిష్కరించేనాథుడు ఉండట్లేదని కాలనీవాసులు వాపోయారు.

### ఇంటికి చుట్టాలు వస్తలేరు..



గతేడాది నవంబర్ నుంచి తాగునీటి నల్లాలు బంద్ అయ్యాయి. ఇప్పటికి నీరు రావడం లేదు. ఆరు నెలలు గడుస్తున్నా కాలనీకి తాగు నీరు ఇవ్వాలనే ఆలోచనే అధికారులు చేయడం లేదు. బోరు నీటిని అన్నింటికి వాడుతుండటంతో ఇంటికి చుట్టాలు రావడం లేదు. మీ ఇంట్లో ఉప్పు నీళ్లు బాబోయ్ అంటూ ఇంటికి వచ్చేందుకు జంకుతున్నారు. ఈ నీటిని వాడితే ఇనుప వస్తువులే తుప్పు పడుతున్నాయి. మాకు మంజీర నీరు ఇవ్వాలని అందరినీ అడుగుతున్నాం. ఎవరు పట్టించుకోవట్లేదు.

- విజయ, సాయి సంతోషి కాలనీవాసి, చిట్కుల్

### నీటి కోసం అందరినీ అడుగుతున్నాం..



తాగునీరు రాక ఆరునెలలపైనే అవుతున్నదని అధికారులకు చెబుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు విస్తరణలో పైపులు పగిలాయని 2024 నవంబర్‌లో నీటిని నిలిపివేశారు. ఇప్పటికీ పునరుద్ధరణ చేయట్లేదు. పోనీ ఎండకాలం ట్యాంకర్లతోనైన మంజీర నీరు ఇస్తున్నారా ? అంటే అదీ లేదు. అధికారుల పాలనకావడంతో నాయకులు పట్టించుకోవడం లేదు. మాజీ లీడర్లు మా కాలనీకి నీరువ్వాలని చెప్పినా అధికారులు స్పందిస్తలేరు. బోరు నీళ్లను వాడుతుంటే జుట్టురాలుతూ, చర్మవ్యాధులు వస్తున్నాయి.

-నర్సింహులు సంతోషి కాలనీవాసి, చిట్కుల్


సీరూర్ గ్రామ శివారులో మంజీరా నది రోడ్డుపై ప్రమాదకరంగా మార్ని పెద్దగుంతలు

## ప్రమాదకరంగా మంజీరా బ్రిడ్జి రోడ్డు

**భయపడుతున్న ప్రయాణికులు, వాహనదారులు**

రాయికోడ్, మే 11 : మండల పరిధిలోని సీరూర్ నుంచి గ్రామ శివారులో ఉన్న మంజీర నది వద్ద ఏర్పడిన పెద్ద గుంతతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వావానదారులు భయపడుతున్నారు. నిత్యం లారీలు, ఆర్టీసీ బస్సులు అటోలు రాకపోకలు సాగిస్తున్నా, ఆర్‌అండ్‌బీ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాయికోడ్ మండల కేంద్రం నుంచి ఈ రోడ్డుపైనే నారాయణఖేడ్, మెదక్,నిజామాబాద్, జోగిపేట్, అల్లాదుర్గంతో పాటు బీదర్, జహీరాబాద్, సదాశివపేట్, హైదరాబాద్‌తో పాటు వివిధకు ప్రతి రోజు ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ రోడ్డుపైనే ఉన్న మంజీర బ్రిడ్జి వద్ద ఏర్పడిన గుంత, సైడ్ వాల్ కూలిపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపైన రెండు వైపులా నుంచి వాహనాలు ఒకేసారి వస్తే ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఈ రోడ్డుకు మరమ్మతు చేయకపోవడంతో ఈ ప్రాంతాంలోని ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు.

## కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు అవాస్తవం

**సదాశివపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతా గోపాల్**


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్

సదాశివపేట, మే 11 : కాంగ్రెస్ నాయకులు తమ మనోభావాలు దెబ్బతీసే కుట్ర చేస్తున్నారని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు చింతా గోపాల్ మండిపడ్డారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ తమపై చేస్తున్న ఆరోపణలు అవాస్తమని స్పష్టం చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో చింతా గోపాల్ మాట్లాడారు. రోడ్డుపై లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నారని తనపై కాంగ్రెస్ నాయకుడు చేస్తున్న ఆరోపణలు అవాస్తమని తెలిపారు. ఇనామ్ భూమిలో సదాశివ ఎన్‌క్లేవ్ లేవట్ చేశారని కాంగ్రెస్ నాయకుడి ఆరోపణలో నిజంలేదన్నారు. ప్రస్తుత ఎమ్మెలే చింతా ప్రభాకర్ గతంలో 1996లో సదాశివ ఎన్‌క్లేవ్ లేవుట్ చేయడం జరిగిందని, కౌన్సిలర్‌గా ఉన్న కాంగ్రెస్ నాయకుడికి అప్పుడు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. గతంలో పదేండ్లు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సదాశివ ఎన్‌క్లేవ్ తప్పుడు లేవుట్, ఇనామ్ భూమి అని గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుడు తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డా రు. గతంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ సర్వే నెంబర్ 590/1 అసైన్డ్ భూమిని అమ్ముకున్నాడని, అలాగే 590/1 సర్వే నెంబర్ బఫర్ జోన్‌లో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్నదని, ప్రస్తుతం అసైన్డ్ భూమిలో రేకుల షెడ్‌ను నిర్మించి అద్దెకు ఇచ్చారన్నారు. ప్రభుత్వం వెంటనే అసైన్డ్ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకుడు శివరాజ్‌పాటిల్, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి వీరేశం, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు కోడూరి అంజయ్య, మాజీ కౌన్సిలర్లు విద్యాసాగర్‌రెడ్డి, సాతాని శ్రీశైలం, ఆ కుల శివకుమార్, చౌదరి ప్రకాశ్, ఇంద్రమోహన్‌గౌడ్, నాయకులు బరాడి శివ, నాగుల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇండ్లు కూల్చడం హేయమైన చర్య


కూల్చిన ఇండ్ల స్థలాలను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి

అమీన్‌పూర్, మే 11 : అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో సర్వే నెంబర్ 381 లో 5 ఏండ్ల కింద పట్టా సర్టిఫికెట్లు పొంది సుమారు 23 ఇండ్లు నిర్మించిన పేదవాళ్ల ఇండ్లను అధికారులు కూల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని పటాన్‌చెరువు నియోజకవర్గ బీఆర్‌ఎస్ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు బాల్‌రెడ్డితో కలిసి ఆయన పేదల ఇండ్లను కూల్చిన స్థలాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నో రోజులుగా నివాసం ఉంటున్న పేదలకు హౌస్ నంబర్లు, మీటర్లు ఉన్నా అమీన్‌పూర్ రెవెన్యూ అధికారులు ముందస్తు నోటీసు ఇవ్వకుండా కూల్చడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం ఇండ్లు కూల్చడం తప్ప పేదలకు ఒక్క ఇల్లు ఇచ్చింది లేదని మండిపడ్డారు. బాధితులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని భరో సా కల్పించారు. బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు మాణిక్ యాదవ్ ఉన్నారు.

## టీజీ ఎప్‌సెట్ ఫలితాల్లో 10 మంది విద్యార్థులు ఎంపిక

జిన్నారం, మే 11 : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, అండ్ ఫార్మసీ కోర్సులకు సంబంధించి తెలంగాణ ఎప్‌సెట్ 2025 ఫలితాల్లో జిన్నారం గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ ఆదివారం తెలిపారు. పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో అద్భుత ప్రతిభ చాటారు. మహేశ్ 67.72 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 8518 అత్యుత్తమ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. కళాశాల తరపున ఉత్తమ ఫలితాలు సాధించి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు.

## మంజీరాను తోడేస్తున్నారు..

- యంత్రాలతో తవ్వి యథేచ్ఛగా మట్టి దోపిడీ
- పట్టించుకొని అధికారులు


యంత్రాలతో టిప్పర్లను మట్టితో నింపుతున్న దృశ్యం

నాగల్‌గిద్ద, మే 11 : మండలంలో కొందరు అక్రమార్కులు మంజీరా పరీవాహక ప్రాంతంలో ఇష్టానుసారంగా మట్టి దోపిడీ చేస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మట్టికి డిమాండ్ ఎక్కువగా ఉండడంతో మంజీర నదిలో నీరు తగ్గి పోవడంతో మంజీర పరీవాహక ప్రాంతమైనా మోర్గీ, కారాముంగి, గౌడ్‌గాం జనవాడ, షాపూర్ శివారులో అక్రమార్కులు గద్దల్లా వాలిపోయి ఇష్టానుసారంగా మట్టి దందా జోరుగా సాగుతున్నాయి. మంజీర పరీవాహక ప్రాంతంలో అనుమతి లేకుండా అధికారులు అక్రమార్కులు కుమ్మక్కై మట్టి దందా కొనసాగుతున్నాయని స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. చాటు మాటుగా కాకుండా కరస్‌గుత్తి-నారాయణఖేడ్ వెళ్లే ప్రధాన రహదారి పైనే మట్టిని తరలించడం విశేషం. వందల ట్రిప్పుల మట్టి తరలించడం ద్వారా రూ. లక్షల్లో నగదు చేతులు మారుతోందనే ఆరోపణాలున్నాయి. తవ్విన మట్టిని పెద్ద పెద్ద వెంచర్లకు ప్రక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్ర దళారులను అమ్ముకుంటున్నారని ఆరోపణాలున్నాయి. మండలంలో రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్‌కు బాధ్యత అప్పగించడంతో దోపిడీ కొనసాగుతుందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు మండలంపై దృష్టి సారించి అక్రమంగా కొనసాగుతున్న దందాపై చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## వీరభద్రస్వామి ఆలయంలో భక్తుల సందడి


బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గుమ్మడిదల, మే 11: జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడితో కిటకిటలాడింది. భద్రకాళీ అమ్మవారికి కుంకుమార్చనలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరిస్తున్నారు. ఈవో శశిధర్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య, ఆలయకమిటీ అధ్యక్షుడు మద్దిప్రతాప్‌రెడ్డి పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పర్యవేక్షించారు.

## రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సరెడ్డిగారి వెంకట్రామిరెడ్డి


నూతనకమిటీని సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, జిల్లా నాయకుడు బాలకృష్ణారెడ్డి

గుమ్మడిదల, మే11 : మున్సిపాలిటీ కేంద్రంలో రెడ్డి కులస్తులందరూ కలిసి రెడ్డి సంక్షేమ సంఘాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సంక్షేమ సంఘానికి గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన సరెడ్డి గారి వెంకట్రామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కాలకంటి రవీందర్‌రెడ్డి, పోసుగారి శ్రీనివాస్‌రెడ్డి, సరెడ్డిగారి శ్రీనివాస్‌రెడ్డి, ప్ర ధాన కార్యదర్శిగా చిమ్ముల దేవేందర్‌రెడ్డి, కోశాధికారిగా రవీందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా కిచ్చన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, కాలకంటి బాల్‌రెడ్డి, రామక్కపేట ప్రదీప్‌రెడ్డి, సంజీవరెడ్డిలతో పాటు ప్రచార కార్యదర్శులను, సాంస్కృతిక కార్యదర్శులు ఎన్నుకున్నారు. ఈనూతన కమిటీని మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, జిల్లారెడ్డి సంఘం నాయకులు బాలకష్ణారెడ్డి, ధర్మారెడ్డి వారికి శాలువాలతో సన్మానించారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

అందోల్, మే 11 : ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు పిలుపునిచ్చారు. జోగిపేట పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మండల నాయకులతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తు కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని తక్షణమే కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, మండల నాయకులు నరేందర్ గౌడ్, శివకుమార్, రాములు, వెంకటేశం, పెంటయ్య, సత్యం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 96వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు


దీక్ష చేస్తున్న రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మే 11: ప్యారానగర్ డంపింగ్‌యార్డును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో రైతు జేఏసీ నాయకులు రిలే నిరాహారదీక్షలు చేస్తునే ఉన్నారు. మండలంలోని నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ గ్రామశివారులో జీహెచ్ఎంసీతో ఏర్పాటు కాబోతున్న డంపింగ్ యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)ను వెంటనే రద్దు చేయాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 96 వ రోజుకు చేరుకున్నాయి. రైతు జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇక్కడి గ్రామాల ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకుని ఎంఎస్‌డబ్ల్యూ ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## శుభాకాంక్షలు


వేడుకలు జరుపుకొంటున్న బీఆర్‌ఎస్ యువత నాయకుడు నరేందర్ రెడ్డి

జిన్నారం, మే 11 : జిన్నారం మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి సోదరుడు, బొల్లారం మున్సిపల్ బీఆర్‌ఎస్ యువజన నాయకుడు కొలను నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక డిజైర్ సొసైటీలో వ్యాధిగ్రస్త చిన్నారులతో కలిసి నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకొన్నారు. కేక్‌కట్ చేసి, చిన్నారులకు చాక్లెట్లు, పండ్లు పంపిణీ చేశారు. జన్మదిన సందర్భంగా భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు యువజన నాయకుడు నరేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# శంకుస్థాపనతో సరి.. బ్రిడ్జి నిర్మాణమేది..!

- వర్షాకాలం చేరువ.. మళ్లీ వరద కష్టాలు పునరావృత్తం


(బ్రిడ్జి నిర్మాణా పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ , నాయకులు(ఫైల్)

ఝరాసంగం, మే 11 : సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని ప్యారవరం గ్రామానికి సమీపంలో 6 నెలల కింద స్థానిక ఎంపీ చేతుల మీదుగా బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినా నేటికి ప్రారంభం కాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త బ్రిడ్జి నిర్మాణానికి గ్రామీణ రహదారుల నిధుల నుంచి రూ. 3 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. గతేడాది నవంబర్ 30న జహీరాబాద్ ఎంపీ సురేశ్ కుమా ర్ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, అధికారులు, స్థానిక నాయకులతో కలిసి బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో వర్షాకాలంలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి ఇబ్బందులను తొలిగించడానికి ఈ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా ప్రారంభిస్తామని ప్రజలకు ఎంపీ హామీ ఇచ్చారు. కానీ నిధులు మంజూరై దాదాపు ఆరు నెలలు గడుస్తున్నా, పనులను ప్రారంభించడంలో ఎలాంటి కదలిక లేదం టూ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్యారవరం గ్రామస్తుల దశాబ్దాల నాటి కల బ్రిడ్జి నిర్మిస్తే వరద కష్టాలు దూరమవుతాయని, కానీ, ఇప్పుడది కలగానే మిగిలిపోయింది. ప్రతి ఏడాది వర్షాకాలం వస్తుందంటే ప్రజల్లో భయం మొదలవుతుంది, కానీ అధికారులలో మాత్రం కనీస చలనం కూడా కనిపించడం లేదు. ఈ వర్షాకాలం వాగు ప్రవాహం పెరిగితే రైతులు, విద్యార్థులు, రోగులు, వృద్ధులు, అత్యవసరంగా ప్రయాణించే వారికి ఇబ్బందుల తప్పవు. ఇప్పటికైనా సం బంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పం దించి బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రా రంభించాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కొరుతున్నారు.


గతంలో రాకపోకలు నిలిచిన దృశ్యం (ఫైల్)

### కలగానే ప్యారవరం బ్రిడ్జి నిర్మాణం



బ్రిడ్జి నిర్మాణం ఈ వర్షాకాలం కూడా కలగానే మిగల్చారు. శంకుస్థాపన చేస్తే పని మొదలవుతుందనుకున్నాం.. ఆరు నెలలు గడిచినా పనులు ప్రారంభం కాలేదు. వర్షం కురిసిందంటే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ఇప్పుడు మళ్లీ మా పిల్లల చదువులు, అత్యవసర పరిస్థితులు పునరావృత్తమవుతాయి.

-మాణిక్ యాదవ్, ప్యారవరం

### అగ్రిమెంట్ అనంతరం పనులు ప్రారంభిస్తాం

బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ పూర్తయ్యింది. కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది. వెంటనే బ్రిడ్జి నిర్మాణా పనులు ప్రారంభిస్తాం.

-శశిధర్ రెడ్డి, పీఆర్‌ఏఈ, ఝరాసంగం